

వనపర్తి జిల్లా పెద్దగూడెం సమీపంలో వరి పొలంలో కూలీలతో కలిసి నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నేతలు



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో రైతులు, కూలీలతో కలసి పంట పొలంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# భరోసా కోతపై భగ్గుమన్న రైతు

కాంగ్రెస్ సర్కారుపై కర్షకులు కన్నెర్రజేశారు. రైతుభరోసా కోతలపై భగ్గుమన్నారు. రైతుభరోసా పేరిట అన్నదాతలకు పంటల పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలు ఇస్తామంటూ నమ్మబలికి ఓట్లు కొల్లగొట్టిన కాంగ్రెస్ పెద్దలు.. ఇప్పుడు ఆ సాయాన్ని రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మాటతప్పడంపై రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు అన్నదాతలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా, నయవంచన అని మరోసారి రుజువైందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రైతు భరోసా పథకం కింద రూ. 15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. –నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

దండేపల్లి,(లక్సెట్టిపేట), జనవరి 6/చెన్నూర్/జైపూర్/జన్నారం : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. లక్సెట్టిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. చెన్నూర్, జైపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజా రమేశ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సీఎం ఫ్లెక్సీని దహనం చేశారు.

### కదం తొక్కిన కరీంనగర్..

కరీంనగర్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి రైతుభరోసా రూ.12 వేలు మాత్రమే ఇస్తానని ప్రకటించడంపై కరీంనగర్ భగ్గుమన్నది. తెలంగాణ చౌక్‌లో నగర మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి, సుల్తానాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రాల్లో ధర్నా చేశారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు.

### పాలమూరులో పెల్లుబికిన నిరసనలు

మహబూబ్‌నగర్, జనవరి 6: వనపర్తి జిల్లా పెద్దగూడెం చౌరస్తాలో డిక్లరేషన్ పత్రాలను మంటల్లో దహనం చేశారు. నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జోగుళాంబ గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ ఆందోళనలు జోరుగా సాగాయి.

### ధర్నాలతో దద్దరిల్లిన నిజామాబాద్..

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 6: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి, కమ్మర్‌పల్లి, వేల్పూర్, నవీపేట్, ముప్కాల్, బాల్కొండ తదితర మండలాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు.

### హనుమకొండలో డిక్లరేషన్ ప్రతులను సమాధి చేసి నిరసన

హనుమకొండ, జనవరి 6 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిరసన తెలిపారు. వరంగల్ డిక్లరేషన్ చేసిన స్థలంలో హామీ పత్రాలను పాతిపెట్టారు.



హనుమకొండలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో వరంగల్ డిక్లరేషన్ పత్రాలను సమాధి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఉమ్మడి ఖమ్మంలో భగ్గుమన్న అన్నదాతలు

ఖమ్మం, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా తల్లాడలో రైతులతో కలిసి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ధర్నా చేశారు. భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లిలో దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.

### సూర్యాపేటలో సీఎం దిష్టిబొమ్మల దహనం

సూర్యాపేట, జనవరి 6 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్, అనంతగిరి, మఠంపల్లి మండల కేంద్రాల్లోనూ బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో చేసి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. భువనగిరి లోని ప్రిన్స్ కార్నర్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాయి.

### ఉమ్మడి వరంగల్‌లో ఉద్రిక్తత..

వరంగల్, జనవరి 6: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు చోట్ల సీఎం దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వరంగల్ నగరంలోని ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద నిర్వహించిన రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, గోరికొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. రేగొండలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గండ్రను పోలీసులు అరెస్ట్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో నిర్వహించిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో నిర్వహించిన రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.



హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద దాస్యం వినయ్‌భాస్కర్‌ను బలవంతంగా వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

## దాస్యం అరెస్ట్.. ఉద్రిక్తత

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానానికి వెళ్తున్న దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. కనీసం నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతించాలని కోరినా వినకుండా పోలీసులు నిర్బంధించారు. పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాటతోపాటు వాగ్వాదం చోటు చేసుకున్నది. వినయ్ భాస్కర్‌తోపాటు నాయకులు, కార్యకర్తలను బలవంతంగా పోలీసు వాహనాల్లోకి ఎక్కించి కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నగరంలో మంత్రుల పర్యటన ఉన్నందున ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టేషన్‌లోనే నిర్బంధించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోనే వినయ్‌భాస్కర్ నిరసన తెలిపారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో ఆందోళన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ బడుగుల



మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో నిర్వహించిన ఆందోళనలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



ఎల్లారెడ్డిలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ శ్రేణులు

# హామీ ఇచ్చి మాట మారుస్తరా?

**కోత పెట్టేందుకు రైతాంగ పథకమే కనిపించిందా? • మోసం చేసేందుకు మేమే దొరికామా?**

**'రైతు భరోసా'లో కోతలపై అన్నదాతల ఆగ్రహం • ఇదేం 'భరోసా' అంటూ గ్రామాల్లో జోరుగా చర్చ**

**మొన్న రుణమాఫీ.. నేడు భరోసాలో మోసం • హామీ ప్రకారం 15 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్**

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రైతుభరోసాపై మాట తప్పిన కాంగ్రెస్ సర్కారుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక రూ.12 వేలు ఇవ్వడమేంటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో రైతుల మధ్య జోరుగా చర్చ జరుగుతున్నది. ఏ ఇద్దరు రైతులు కలిసినా.. రైతుభరోసా కోతలపైనే ప్రధానంగా చర్చించుకుంటుడటం గమనార్హం. కాంగ్రెస్ సర్కారును నమ్ముకుంటే నయవంచన చేసిందంటూ రైతులు మచ్చటిస్తున్నారు. ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు రైతుభరోసా విషయంలోనూ అదే విధంగా మోసం చేసిందని కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో కోతలు తప్ప.. కడుపు నింపే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెన్నూర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

### సాధ్యం కాకపోతే.. హామీ ఎందుకు ఇచ్చారు?

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ వెనక్కి తీసుకొని, మాట మార్చడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా రైతుభరోసా కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఆర్థిక కారణాలపై రైతులు మరింత గుర్రుగా ఉన్నారు. ఎన్నికలకు ముందు ఈ విషయం తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు. హామీ అమలు చేయడం సాధ్యం కాదని తెలిసినప్పటికీ వాగ్దానం చేశారా? అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంటే ఎన్నికలకు ముందే తమను మోసం చేయాలని కాంగ్రెస్ ప్లాన్ వేసుకున్నదా? అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించుకోకుండానే హామీలు గుప్పించారా? అని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ సాధ్యం కాకపోతే హామీ ఎందుకు ఇచ్చారంటూ నిలదీస్తున్నారు.

## భరోసాలోనూ కోతలా?

ఈ నేపథ్యంలో మోసం చేసేందుకు కాంగ్రెస్ సర్కారుకు రైతులే దొరికారా? అంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు పథకాల్లో కోత పెట్టడమే లక్ష్యంగా హస్తం ప్రభుత్వం పని చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే రుణమాఫీలో కోతలు పెట్టి దాన్ని చేయకుండానే చేతులు దులిపేసుకున్న కాంగ్రెస్.. ఇప్పుడు రైతుభరోసాలోనూ కొర్రీలతో కోతలు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కొందరికి మాత్రమే మాఫీ చేసిందని మండిపడుతున్నారు. ఇక రైతుభరోసా విషయానికొస్తే రూ.15 వేల హామీని తుంగలో తొక్కి రూ.3 వేలు కోత పెట్టి.. రూ.12 వేలకే పరిమితం చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఆ కోత చాలదన్నట్టు సాగు చేసిన భూములకే ఇస్తామంటూ మరో కోత కార్యక్రమాన్ని ముందటేసుకుందని ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికైనా రైతులపై కక్ష సాధింపును కాంగ్రెస్ సర్కారు బంద్ చేయాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి కోతలు లేకుండా ఎకరానికి రూ.15 వేలు భరోసా ఇవ్వాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఖమ్మం జిల్లా తల్లాడలో ధర్నా చేస్తున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లోని ఓ పొలంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను బురదలో తొక్కారు. 'కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఏ పథకం ఆగకపోయేది. తినే అన్నంలో మన్నువోసుకునట్టయ్యింది' మాజీ ఎమ్మెల్యే పుట్టమధుతో మహిళా రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. – మంథని రూరల్



స్టేషన్ ఘన్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



వరంగల్ జిల్లా నెక్కొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద నిర్వహించిన రాస్తారోకోలో కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్